క్లుప్తంగా

కస్తూర్బా పాఠశాల భవనం ప్రారంభం

- శిలాఫలకం ప్రారంభించిన మంత్రి రాజనర్సింహ
- భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజయుడు



ఉండవెల్లి: కస్తూర్బా పాఠశాల నూతన భవనం ప్రారంభానికి మంత్రి వస్తారని ఆశలు పెట్టుకున్న గ్రామస్తులకు, విద్యార్థులు, ఉన్నతాధికారులకు నిరాశే మిగిలింది. మండలంలోని కలుగోట్ల గ్రామంలోని కస్తూర్బా పాఠశాలను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభిస్తారని అనుకున్నారు. కస్తూర్బా పాఠశాల భవన శిలాఫలకాన్ని ఎర్రవల్లిలో మంత్రి ప్రారంభించారు. ప్రోటోకాల్ ప్రకారం శిలాఫలకం ప్రారంభించడంతో రాత్రి 8.30 గంటల సమయంలో కస్తూర్బా పాఠశాల భవనాన్ని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు ప్రారంభించారు.

మహాసభను విజయవంతం చేయండి

గద్వాల అర్బన్: వనపర్తి జిల్లా కేంద్రంలో ఆదివారం ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘమైన గ్రామ పంచాయతీ కార్మిక యూనియన్ రాష్ట్ర స్థాయి ప్రథమ మహాసభను నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభను గ్రామపంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

హరితహారం మొక్కలను సంరక్షించాలి

మల్దకల్: రోడ్లకు ఇరువైపుల హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు సూచించారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల ప్రధాన రహదారులకు ఇరువైపుల నాటిన మొక్కలను వారు పరిశీలించారు. హరితహారం నాటికి నర్సరీలలో మొక్కలను పెంచేందుకు నిర్వాహకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యం మేరకు నర్సరీలలో మొక్కలను పెంచి హరితహారం నాటికి సిద్ధం చేయాలని కోరారు. మొక్కలకు ట్రీగార్డులను ఏర్పాటు చేసి సంరక్షించాలన్నారు. గతంలో నాటిన మొక్కలకు పాదులు ఏర్పాటు చేసి పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మరమ్మత్తులు చేపట్టడంతో ఆదివారం పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కులగుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ గోవిందు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 33/11కేవీ పాత సబ్‌స్టేషన్, టౌన్ 1 ఫీడర్‌ల మరమ్మతుల కోసం ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. దాని వలన పట్టణంలోని పాతబస్టాండ్, దుర్గానగర్, మాలపేట, కమంతంపేట, గుర్రంతోట, మేకలపేట, తెలుగుపేట, ఉప్పరిపేట, మడ్డిగుంత, కాలమ్మపేట, గాంధీచౌక్ తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలోని బింగుదొడ్డి, జడదొడ్డి శివార్లలో వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ సౌకర్యంకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సఖి కేంద్రంలో సమస్యలు

- శాశ్వత భవనానికి రూ.49.60లక్షలు
- సెంటర్ చుట్టూ కంపౌండ్ కరువు
- పట్టించుకోని అధికారులు



జిల్లా కేంద్రంలోని సఖి సెంటర్

గద్వాల అర్బన్: లైంగిక, గృహహింస తదితర వేధింపులకు గురయ్యే బాధిత మహిళలు, బాలికలకు ఉపశమనం కల్పించేందుకు జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో సఖి కేంద్రం ఏర్పాటు చేశారు. ఆపదలో ఉన్న బాధితులకు అప్పటికప్పుడు ఆశ్రయం కల్పించడంతో పాటు వైద్యం, న్యాయ సాయం, చట్టం ద్వారా రక్షణ, కౌన్సెలింగ్ తదితర సేవలను అందించేందుకు 2019 జూలైలో ఏర్పాటు చేశారు. సఖి కేంద్రం ప్రారంభించినప్పటి నుంచి అద్దె భవనంలో కొనసాగింది. సఖీ కేంద్రానికి శాశ్వత భవనం నిర్మాణం చేసినా, ఈ భవనంలో సమస్యలు వెంటాడుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.

శాశ్వత భవనం..

ఏర్పాటైనప్పటి నుంచి సఖి కేంద్రం అద్దె భవనంలో సరైన సౌకర్యాలు లేక బాధితులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయిదు గదుల్లో సీఏ చాంబర్, కౌన్సెలింగ్, అకౌంటెంట్, న్యాయ సలహాల కోసం, ఐటీ తదితర విభాగాలు ఉండేవి. బాధిత మహిళలు, బాలికలకు ఆశ్రయంతో పాటు ఆయా విభాగాలకు సేవలు కొనసాగించారు. సఖీ సెంటర్‌కు శాశ్వత భవనం నిర్మించాలనే ఉద్దేశ్యంతో జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో రెవెన్యూ కాలనీలోని ప్రభుత్వ అభ్యాసన ఉన్నత పాఠశాల పక్కన్న నూతన భవనం నిర్మించారు. వాటిని ఎన్నికల ముందు ప్రారంభించి సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

సమస్యలకు నిలయం..

సఖి సెంటర్ భవనాన్ని సుమారు రూ.49.60లక్షల వ్యయంతో నిర్మించారు. ఈ భవనంలో సమస్యలు వెంటాడుతున్నాయి. సెంటరు చుట్టు కంపౌండ్ కరువైంది. మరోవైపు సెంటర్ వెనుకవైపు పూర్తిగా ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో విష పురుగులు వస్తున్నాయి. దీంతో బాధితులు, వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కనీసం పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు సైతం తొలగించేందుకు చర్యలు తీసుకోకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సెంటర్ ఉన్న ప్రాంతంలో సరైన విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో ఆ ప్రాంతమంతా చీకటిమయంగా మారుతుంది. మరోవైపు సెంటర్‌కు ముందు భాగంలో కిటికీలకు అద్దాలు ఫగిలాయి. బాధిత మహిళలు, సిబ్బంది, చలి, దోమల వల్ల అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోని సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం..



జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రాలో కొన్ని సమస్యలున్నాయి. సెంటర్ చుట్టూ కంపౌండ్ లేదు. సెంటర్‌లోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.

– ముషాయిదా బేగం, డీడబ్ల్యూఓ

చేనేత పార్కు నిర్మాణం చేయాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న పద్మశాలిసేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పులిపాటి వెంకటేశ్

గద్వాల రూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకునేందుకు గద్వాల సమీపంలో 50ఎకరాలలో చేనేత పార్కును ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని జిల్లా పద్మశాలి సేవాసంఘం అధ్యక్షులు పులిపాటి వెంకటేశ్ మంత్రి దామోదర్‌నరసింహకు తెలిపారు. గద్వాలకు వచ్చిన మంత్రికి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో చేనేత కార్మికులు ఉపాధిలేక వృత్తికి దూరమయ్యారని వారికి ఉపాధితో పాటు, వసతి కల్పించాలన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేయతలపెట్టిన చేనేత పార్కులో 2వేల హోం కమ్ వర్క్‌షెడ్లను ఏర్పాటు చేయాలని వెంకటేశ్ కోరారు.

చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్



చెకుముకి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

గద్వాల అర్బన్: వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయిలో చెకుముకి పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నుంచి దినేష్, విజయేంద్ర, అమృత, విశిష్ట నోబుల్ హైస్కూల్ నుంచి వెంకట మనోజ్ఞ, కృష్ణవంశీ, విష్ణువర్ధన్, మండలంలో వీరాపురంలోని రెసిడెన్సియల్ గురుకుల పాఠశాలలో పవన్, మనోజ్‌కుమార్‌లు జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికయ్యారు. శనివారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారిని అభినందించారు.

అయిజ: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు జీహెచ్ఎం రాములు ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టాలెంట్ టెస్ట్‌లో 8,9,10వ తరగతి నుంచి ముగ్గురు చొప్పున విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మొత్తం 66 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలైన విద్యార్థులకు ఉపాధ్యాయులు చకుముకి సైన్స్‌కు సంబంధించిన పుస్తకాలు అందజేశారు.

గట్టు: మండల స్థాయి చెకుముకి పోటీలను ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. తెలుగు మీడియం విభాగంలో ఆరగిద్ద ఉన్నత పాఠశాల, ఇంగ్లిష్ మీడియంలో మాచర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. వీరు ఫిబ్రవరి3న జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ ఓబులేష్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, శివశంకర్, నర్సింహులుగౌడు, పరశురాం, శ్రీరాములు, చంద్రబాబునాయుడు, అశోక్, వెంకట్రాములు, పావని పాల్గొన్నారు.



ఇటిక్యాలలో చెకుముకి సైన్స్ పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ రాజు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని 13 తెలుగు మీడియం, 4 ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఆంగ్ల మాధ్యమం నుంచి ఎర్రవల్లి ఏకశిల పాఠశాల, తెలుగు మాధ్యమం నుంచి ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ ఇటిక్యాల, ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమం నుంచి బీచుపల్లి గురుకుల పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబచ్చారు. వీరు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు మండల విద్యాధికారి రాజు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతయ్య, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్, పుల్లయ్య, సతీష్ కుమార్, గిరిధర్ కుమార్, రమేష్, ఆయా పాఠశాలలు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఇర్కిచేడులో డ్యాన్స్‌ప్రోగ్రాం



కేటీదొడ్డి: మండలంలోని ఇర్కిచేడులో శుక్రవారం జంగిల్‌సాబ్ ఉర్సు సందర్భంగా సర్పంచు మాధవి ఆధ్వర్యంలో డ్యాన్స్‌ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. డ్యాన్స్‌ప్రోగ్రాంలో చిన్నారులు వివిధ వేషధారణలో ప్రజలను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శ్రీధర్, ఆంజనేయులు, పూలరంగన్న ఉన్నారు.

పరిమితికి మించి ప్రయాణం..



మానవపాడు: ప్రయాణం చేయాలంటే గుండెల్లో దడ పుడుతోంది. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని, తరచూ ఎక్కడో ఒకచోటా ప్రమాదాలు జరుగుతున్నాయి. పరిమితికి మించి ప్రయాణం చేయడం ప్రమాదకరమని అధికారులు నిబంధనలు పాటించాలని చెబుతున్నా వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఆటోలలో, బొలెరో వాహనంలో లెక్కకు మించి అతివేగంతో ప్రయాణిస్తున్నారు. అధికారులు చూసి చూడనట్లు వ్యవహస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే పరిమితికి మించి ప్రయాణికులను తరలించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తొలి అపెండెక్స్ ఆపరేషన్

నారాయణపేట రూరల్: పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలోని వైద్యబృందం తొలిసారిగా లాప్రోస్కోపి విధానంలో యువకుడికి అపెండెక్స్ ఆపరేషన్‌ను విజయవంతం చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంజిత్ తెలిపారు. ధన్వాడ మండలం కొత్తపల్లికి చెందిన అయ్యప్ప కడుపులో తీవ్ర నొప్పితో వచ్చాడు. వెంటనే ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన లాప్రోస్కోపి మిషన్ సహాయంతో ఆపరేషన్‌ను పూర్తి చేశారు.

భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలా క్షేత్రం



ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రధాన దేవాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్దకల్ స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిశిలా క్షేత్రం, కృష్ణస్వామి ఆలయాలలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, సీతారామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బాబురావు, ఆలయ సిబ్బంది ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన జెడ్పీ చైర్‌పర్సన్



టీటీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల: తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆవిష్కరించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలన్నారు. అక్షరాస్యతలో జిల్లాను అగ్రగామిగా నిలపాలన్నారు. విద్యా అభివృద్ధిలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం అన్ని వర్గాల ప్రజలకు మంచి చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఉపాధ్యాయులు అందజేశారు. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభించనుందని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, నాయకులు రాఘవేందర్, గజేందర్, గోపీనాథ్, భాస్కర్, మహిబూబ్ పాషా, రామకృష్ణ, రవి, శ్రీవాణి పాల్గొన్నారు.

ఐక్య పోరాటానికి సిద్ధం కావాలి



మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రత్నకరం కోటం రాజు

గద్వాల అర్బన్: ఎన్నో పోరాటాలతో సాధించుకున్న వెల్ఫేర్ బోర్డును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసేందుకు కంకణం కట్టుకుందని భవన నిర్మాణ కార్మిక యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రత్నకరం కోటం రాజు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 44కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల చట్టాన్ని తుంగలో తొక్కుతుందన్నారు. వెల్ఫేర్ బోర్డు రక్షణకు కార్మికవర్గం ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మికుల సంక్షేమ బోర్డు రక్షణకు ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమ్మెకు నిర్మాణ రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు సీతారాములు, బుచ్చన్న, సామేలు, కిష్టన్న, ఆంజనేయులు ఉన్నారు.

సమస్యలపై అలసత్వం ఉండకూడదు



కార్యక్రమంలో పలు అంశాలను బోధిస్తున్న కిషోర బాలికలు

రాజోళి: కిషోర బాలికల సమస్యలపై అలసత్వం ప్రదర్శించవద్దని తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ అన్నారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం కిషోర బాలికల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సమస్యలపై ఇతర అంశాలపై చర్చించారు. బాలికలతో మాట్లాడారు. వారు నేర్చుకున్న విషయాలను ఇతర విద్యార్థులకు బోధించే విధానాలను నేర్పారు. క్రమం తప్పకుండా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయని, వాటితో పాటు బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జీ హనిమిరెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేష్, తిప్పన్న, నాగపుల్లయ్య, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి



అలంపూర్ చౌరస్తాలో మాట్లాడుతున్న కేశవరావు

అలంపూర్: ఇటిక్యాల మండలం సాతర్ల గ్రామంలో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఎస్పీ ఇన్‌చార్జీ కేశవరావు తెలిపారు. శనివారం ఆయన అలంపూర్ చౌరస్తాలోని బీఎస్పీ కార్యాలయంలో మాట్లాడారు. ఇటిక్యాల మండలం సాతర్లలో డా బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథులుగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరవుతున్నారని, అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు నాగరాజు, తిరుపాలు, బోరవెల్లి మహేష్, వెంకటేష్, ప్రభుదాసు, అనోక్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధి ప్రణాళికలపై సమావేశం



పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని తీర్మానం చేసిన సర్పంచు

కేటీదొడ్డి: మండలంలోని సోంపురం, సిద్ధన్‌పల్లి గ్రామాల్లో ఎంవీఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని గ్రామ పంచాయతీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను ప్రకటించాలని సోంపురం, సిద్ధన్‌పల్లి పాఠశాలలో 89 మంది విద్యార్థులకు కేవలం ఒక్క ఉపాధ్యాయుడు పనిచేస్తున్నట్లు తెలిపారు. విద్యా హక్కుచట్టం ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలని, అదనంగా తరగతుల గదులు, పాఠశాల ప్రహరీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి తీర్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచు తిక్కన్న, శంకరమ్మ, హెచ్ఎం, ఎంవీఎఫ్ ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

దిగుబడి లేని సీడుజొన్న

- యాసంగిలో సాగునీరందని వైనం
- మొక్కజొన్న, వరికి బదులు సీడు జొన్న సాగు
- సగానికి తగ్గిన ఆదాయం
- వడ్డేపల్లి, రాజోళి మండలాల్లో వందల ఎకరాల్లో..



తనగల శివారులో సాగుచేసిన సీడు జొన్న పంట

శాంతినగర్: ఆర్డీఎస్ ఆయకట్టు కింద యాసంగిలో మొక్కజొన్న, వరికి బదులుగా సీడు జొన్న సాగుచేయాల్సిన దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల టీబీ డ్యాంలో నీరు పూర్తిస్థాయిలో లేదని ఆర్డీఎస్ నీటి వాటా సగానికి తగ్గించామని సాగు నీటి అధికారులు చెప్పడంతో విధిలేని పరిస్థితిలో సీడుజొన్న సాగుకు రైతులు ఉపక్రమించారు. పంట పాలుపోసే దశకు వచ్చేసరికి ఆర్డీఎస్ కెనాల్‌లో నీటి ప్రవాహం నిలిచిపోయింది. దీంతో బోరు బావులు, బావుల్లోని కొద్దిపాటి నీటితో డ్రిప్ ద్వారా నీటిని అందించి పంటను కాపాడుకున్నారు. ప్రస్తుతం పంట కోత దశకు వచ్చింది. మరో 15 రోజుల్లో పంట కోస్తామని రైతులు చెబుతున్నారు. రాజోళి మండలంలో 844 మంది రైతులు 1628 ఎకరాల్లో సాగు చేయగా, వడ్డేపల్లి మండలంలో 486 మంది రైతులు 984 ఎకరాల్లో సీడు జొన్న సాగుచేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. మొక్కజొన్న, వరి సాగు చేస్తే దిగుబడితో పాటు ధర ఎక్కువగా వచ్చేదని రైతులు వాపోతున్నారు. సీడుజొన్న సాగుతో లక్షలు నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై వ్యవసాయశాఖ, మార్కెటింగ్‌శాఖ అధికారులు, ప్రభుత్వం స్పందించి సీడు జొన్నకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటాల్‌కు కనీసం రూ.5 వేలు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

దిగుబడి సగమే..

సాగునీరు పుష్కలంగా ఉంటే మొక్కజొన్న సాగుచేసేవారు. టీబీ డ్యాంలో నీటి నిల్వలు సగం మాత్రమే ఉన్నాయని, ఇండెంట్ సగం మాత్రమే ఇస్తామని కర్ణాటక అధికారులు ప్రకటించారు. దీంతో మొక్కజొన్నకు నీరు ఎక్కువగా అవసరం ఉంటుందని, పంటకాలం ఎక్కువ ఉండటంతో సీడుజొన్న సాగు తప్పని పరిస్థితిలో సాగుచేశారు. మొక్కజొన్న ఎకరానికి 40 క్వింటాళ్లు వచ్చేది, సీడు జొన్న కేవలం 15 క్వింటాళ్లు మాత్రమే వస్తోంది.


మార్కెటింగ్ సౌకర్యం లేక.

సీడు జొన్న పంట పండించినా మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితులున్నాయి. మొక్కజొన్న ఉత్తర పుడ్స్‌లాంటి పౌల్ట్రీ పరిశ్రమల వారికి అమ్ముకునే వారు. గతేడాది సీడు జొన్న క్వింటాల్ కేవలం రూ.2500 నుంచి రూ.3 వేలు పలికింది.

ఆరు నెలల వరకు ఇళ్లలోనే..

సీడు జొన్న కొనుగోలు చేసే వారు లేక ఒక్కోసారి ఆరు నెలల పాటు ఇళ్లలోనే నిల్వ చేసుకోవాల్సి ఉంటుంది. పెట్టిన పెట్టుబడులకు వడ్డీలు ఎక్కువై చాలా నష్టపోవాల్సి వస్తుందని రైతులు పేర్కొన్నారు.

ప్రతిఏటా మొక్కజొన్న వేసేవాళ్లం..



యాసంగిలో ప్రతిఏటా మొక్కజొన్న వేసేవాన్ని. ఆర్డీఎస్ నీళ్లు ఫిబ్రవరి లేదా మార్చి వరకు వచ్చేవి. ఈఏడాది జనవరిలోనే నిలిచిపోయాయి. సగం నీటి వాటా వస్తుందని చెప్పడంతో మొక్కజొన్న పండే పరిస్థితి ఉండదని సీడుజొన్న సాగుచేశాను. ఎకరానికి 15 క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. మొక్కజొన్న అయితే ఎకరానికి 40 క్వింటాళ్లు వచ్చేవి.

– బోయ భీమన్న, ఆయకట్టు రైతు, తనగల

సీడు జొన్నకు ధర తక్కువ :



సీడు జొన్నకు మార్కెట్లో ధర తక్కువ ఉంటుంది. రొట్టెలకు ఉపయోగపడవని ప్రజలు కొనుగోలు చేయరు. కోళ్లదానకు మాత్రమే అమ్ముకోవాల్సి వస్తుంది. దీంతో క్వింటాల్ రూ.2,500 నుంచి రూ.3 వేలు ఉంటుంది. తెల్లజొన్న రూ.7 నుంచి రూ.8 వేలు ధర పలుకుతోంది. సీడుజొన్నకు రూ.5 వేల గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం కొనుగోలు చేయాలి.

– చాకలి కృష్ణ, ఆయకట్టు రైతు, తనగల

మహిళలు ఆర్థికంగా రాణించాలి

మదనాపురం: సామాజిక విజ్ఞాన కళాశాల, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ బీఎస్సీ డిగ్రీ విద్యార్థినులు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ కార్యక్రమం ద్వారా గ్రామీణ కుటుంబ స్థితిగతులపై అధ్యయనం చేస్తున్నారు. శనివారం రాత్రి నెలివిడిలో కేవీకే శాస్త్రవేత్త అనిత ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా సంఘాల బలోపేతంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం మహిళలకు ఇస్తున్న రుణాల గూర్చి వివరించారు. మేఘన, రసజ్ఞ, రచన, సుష్మ, చరణ్య, గీత, పాల్గొన్నారు.

30న సర్వసభ్య సమావేశం

మానవపాడు: మండల కేంద్రంలో ఈ నెల 30వ తేదీన సర్వసభ్య సమావేశం ఎంపీపీ అశోక్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపీడీఓ రమణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రావాలని తెలిపారు.